క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

నగరంపాలెం: మరమ్మతుల దృష్ట్యా టౌన్-3 పరిధిలో శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు గుంటూరు ఆపరేషన్ టౌన్-3 డీఈఈ బి.రాజమోహన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కేవీపీకాలనీ, 60 అడుగుల రోడ్, కృష్ణబాబుకాలనీ, జోసఫ్‌నగర్, కోదండ రామయ్యనగర్, కొత్తకాలనీ, కావేరి కాలనీ, కామాక్షినగర్, మిర్చి యార్డ్ రోడ్, లాల్‌పురం, ఏటుకూరు, బొంతపాడు, ఆర్.అగ్రహారం, నల్ల చెరువు, ఇండస్ట్రియల్ ఏరియాలో అంతరాయం ఏర్పడుతుందని, వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

నగరంపాలెం సీఐగా లోకనాథం



నగరంపాలెం: పశ్చిమ సబ్ డివిజన్ పరిధిలోని నగరంపాలెం పోలీస్‌స్టేషన్ సీఐగా సీహెచ్.లోకనాథం నియమితులయ్యారు. ఈ మేరకు శుక్రవారం రాత్రి స్టేషన్‌లో ఆయన బాధ్యతలు స్వీకరించారు. 2009లో ఎస్ఐగా చేరిన ఆయన మాచవరం, అడవులదీవి, నరసరావుపేట వన్ టౌన్, నరసరావుపేట టూ టౌన్, పీటీసీలో పనిచేసి కొద్దిరోజుల కిందట సీఐగా ఉద్యోగోన్నతి పొందారు. నగరంపాలెం సీఐగా తొలి పోస్టింగ్. ఇక్కడ సీఐగా పని చేసిన డి.నరేష్‌కుమార్‌ను నల్లపాడు పీఎస్‌కు బదిలీ చేశారు.

20 నుంచి ఏపీ ఈఏపీ సెట్, నీట్‌కు ఉచిత శిక్షణ

గుంటూరు ఎడ్యుకేషన్: మార్కెట్ సెంటర్లోని హిందూ కళాశాలలో ఈనెల 20 నుంచి ఏపీ ఈఏపీ సెట్, నీట్‌కు అనుభవజ్ఞులైన అధ్యాపకులతో ఉచిత శిక్షణ తరగతుల్ని నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ పి. మల్లికార్జునప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రోజువారీ తరగతులతో పాటు వారాంతపు గ్రాండ్ టెస్ట్‌లను నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఇతర వివరాలకు 98851 98640, 83329 11155 నంబర్లలో సంప్రదించాలని కోర్సు కో-ఆర్డినేటర్ డాక్టర్ ఏ. మంజుశ్రీ సూచించారు.

సోషల్ మీడియాపై నియంత్రణ అవసరం



లక్ష్మీపురం: సోషల్ మీడియాపై ప్రభుత్వ నియంత్రణ అవసరమని అవగాహన సంస్థ సభ్యుడు, ఇంజినీర్ ఎస్.సదాశివం కోరారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో శుక్రవారం 'గాడి తప్పుతున్న సోషల్ మీడియా' అనే అంశంపై నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సోషల్ మీడియా విచ్చల విడితనం పేట్రేగి పోతోందని, సెలబ్రిటీల నుంచి సామాన్యుల వరకు వేధింపుల బారిన పడుతున్నారని తెలిపారు. గీతాంజలి లాంటి సున్నిత మనస్కులు ఆత్మహత్యలకు పాల్పడటం ఆందోళనకరమని పేర్కొన్నారు. ఇటీవల ఆత్మహత్య చేసుకున్న గీతాంజలికి సంస్థ సభ్యులు నివాళులర్పించారు. కార్యక్రమంలో విద్యావేత్త ఆర్.వి. సింగరయ్య, సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి, న్యాయవాది అవధానుల హరి పాల్గొన్నారు.

నల్లపాడు సీఐగా నరేష్ కుమార్



గుంటూరు రూరల్: నల్లపాడు పోలీస్ స్టేషన్ నూతన సీఐగా డి నరేష్ కుమార్ శుక్రవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పని చేసిన సీఐ సస్పెండ్ కావటంతో బదిలీలలో భాగంగా ఐజీ పాలరాజు నరేష్ కుమార్‌ను నల్లపాడు పోలీస్‌స్టేషన్ సీఐగా నియమించారు. గతంలో ఆయన దిశ పోలీస్ స్టేషన్, నగరం పాలెం, చేబ్రోలు పోలీస్ స్టేషన్‌లలో సీఐగా విధులు చేపట్టారు.

జర్మన్ భాష శిక్షణ తరగతులు ప్రారంభం

గుంటూరు రూరల్: జర్మనీలో హెల్త్‌కేర్ రంగంలో విద్యార్థులకు మంచి అవకాశాలున్నాయని ఏపీఎస్ఎస్‌డీసీ ఎండీ డాక్టర్ వినోద్‌కుమార్ తెలిపారు. శుక్రవారం నల్లపాడులోని సెయింట్ జోసఫ్ నర్సింగ్ కళాశాలలో క్యూరా పర్సనల్, ఏపీఎస్ఎస్‌డీసీ సహకారంతో జర్మనీలో నర్సింగ్ ఉద్యోగ అవకాశాల కోసం భాషా శిక్షణను ప్రారంభించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ జర్మనీలో ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకునేందుకు విద్యార్థులకు అవసరమైన భాషపై ఉచితంగా శిక్షణ ఇచ్చేందుకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి పీ ప్రణయ్ మాట్లాడుతూ ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, క్యూరా పర్సనల్ సంస్థతో కళాశాల త్రైపాక్షిక ఒప్పందం చేసుకున్నట్లు చెప్పారు. దీని ద్వారా విద్యార్థులకు భాషపై శిక్షణ ఇచ్చి వారికి ఉపాధి కల్పనకు కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఏపీఎస్ఎస్‌డీసీ ఈడీ జి అనిల్‌కుమార్, క్యూరా పర్సనల్ సంస్థ సీఈవో కృష్ణజవాజీ, సంస్థ డైరెక్టర్ అప్పన హేమ, సంస్థ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ బి వల్లి, హెల్త్ కేర్ అపోస్టలేట్ సిస్టర్ క్లిటస్, గుంటూరు ప్రావిన్స్, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ విక్టోరియా, వైస్ ప్రిన్సిపల్ సిస్టర్ లిస్సీథామస్, జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అసోసియేట్ మేనేజర్ వినయ్‌భూషణ్ పాల్గొన్నారు.

ఎన్నికల్లో బూత్ ఏజెంట్ల పాత్ర కీలకం

- పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్త కిలారి రోశయ్య
- పేదల సంక్షేమానికి సీఎం వై.ఎస్.జగన్ పెద్దపీట: ఎమ్మెల్యే ముస్తఫా
- రానున్న ఎన్నికల్లో ఆశీర్వదించాలి: సమన్వయకర్త నూరిఫాతిమా



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రోశయ్య, వేదికపై నూరిఫాతిమా తదితరులు

పట్నంబజారు: రానున్న ఎన్నికల్లో బూత్ ఏజెంట్ల పాత్ర ఎంతో కీలకమని పొన్నూరు ఎమ్మెల్యే, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ గుంటూరు పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్త కిలారి రోశయ్య పేర్కొన్నారు. తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫా, సమన్వయకర్త షేక్ నూరిఫాతిమా ఆధ్వర్యంలో పొన్నూరు రోడ్డులోని ఏఆర్ కన్వెన్షన్ హాలులో శుక్రవారం బూత్ ఏజెంట్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కిలారి రోశయ్య మాట్లాడుతూ ఎన్నికల సమయంలో బూత్ ఏజెంట్ల పనితీరు ఎంతో కీలకమని తెలిపారు. నియోజకవర్గానికి సంబంధించి పూర్తిస్థాయిలో ఓట్ల పరిశీలనతో పాటు ఇతర పార్టీలు దొంగ ఓట్లు వేయకుండా చూడాలని చెప్పారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన పథకాలే రానున్న ఎన్నికల్లో మనపార్టీని విజయతీరాలకు చేర్చనున్నాయని చెప్పారు. ప్రతి కార్యకర్త సగర్వంగా తాను వైఎస్సార్ సీపీ కార్యకర్తలమని చెప్పుకునేలా సీఎం జగన్ పరిపాలన అందించారని తెలిపారు. తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫా మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి సీఎం వై.ఎస్.జగన్ పెద్దపీట వేశారన్నారు. నా ఎస్సీలు, నా ఎస్టీ, నా బీసీలు, నా మైనార్టీలు అంటూ అణగారిన పేద వర్గాలను తన సొంత మనుషుల్లా భావించిన గొప్ప మనస్సున్న వ్యక్తి అని కొనియాడారు. త్వరలో జరగనున్న ఎన్నికల్లో తూర్పు నియోజకవర్గ అభ్యర్థిగా నిలబడుతున్న తన బిడ్డ నూరిఫాతిమాను ఆశీర్వదించాలని కోరారు.

నిరంతరం మీతోనే ఉంటా: నూరిఫాతిమా

నేను ఎమ్మెల్యే ముస్తఫా కుమార్తెను.. మంచి మనస్సు అందరితో కలిసిపోయే గుణం మా కుటుంబం సొంతం.. మీ అందరూ మీ ఇంటి బిడ్డగా రానున్న ఎన్నికల్లో తనను ఆశీర్వదించాలని వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరిఫాతిమా కోరారు. తాను అన్ని వేళలా ప్రజలకు అందుబాటులో ఉంటూ మీ నూరిఫాతిమాగా మీ అందరితోనే కలిసి ఉంటానని స్పష్టం చేశారు. తూర్పు నియోజకవర్గ ప్రజలు తనను ఎమ్మెల్యేగా ఆశీర్వదిస్తే అసెంబ్లీలో నియోజకవర్గం నుంచి వెళ్లి ప్రమాణ స్వీకారం చేస్తానని చెప్పారు. ఎన్నికల ప్రక్రియలో బూత్ ఏజెంట్లు కీలకంగా వ్యవహరించాలని సూచించారు. నియోజకవర్గంలో 99 శాతం పథకాలను ప్రజలు అందజేయడంతోపాటు, అభివృద్ధి పనుల్ని పూర్తి చేశామని తెలిపారు. ప్రజల్లోకి పెద్ద ఎత్తున వైఎస్సార్ సీపీ చేపట్టిన సంక్షేమ పథకాల్ని తీసుకెళ్లాలని కోరారు. బూత్ ఏజెంట్లు అంతా బాధ్యతగా దగ్గరుండి పనిచేయాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డెప్యూటీ మేయర్ వనమా బాలవజ్రబాబు, కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, మండల, క్లస్టర్ ఇన్‌చార్జిలు, పలు కార్పొరేషన్ల చైర్మన్‌లు, డైరెక్టర్లు పాల్గొన్నారు.

నేడు రెడ్డి బాలికల హాస్టల్‌లో అదనపు గదులకు భూమిపూజ

గుంటూరు ఎడ్యుకేషన్: స్తంభాలగరువులోని ఉడుముల సాంబిరెడ్డి-కోటిరత్నం బాలికల వసతి గృహంలో బండి సాహితీరెడ్డి చారిటబుల్ ట్రస్ట్, ఉడుముల కోటిరత్నం, ఇతర దాతల సహకారంతో చేపట్టిన అదనపు గదులు, బండి సాహితీరెడ్డి రీడింగ్ హాలు నిర్మాణానికి శనివారం భూమిపూజ నిర్వహిస్తున్నట్లు దాతల్లో ఒకరైన బండి అశోక్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9గంటలకు జరిగే కార్యక్రమానికి రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి విడదల రజిని, ఎమ్మెల్సీలు లేళ్ల అప్పిరెడ్డి, టి. కల్పలతారెడ్డి, చంద్రగిరి ఏసురత్నం, ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్, మేయర్ కావటి మనోహర్ నాయుడు, మాజీ ఎంపీ మోదుగుల వేణుగోపాలరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరుకానున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా బండి సాహితీరెడ్డి ట్రస్ట్ ద్వారా పెదకాకాని మండలం వెనిగండ్లలోని జెడ్పీ హైస్కూల్లో బండి సాహితీరెడ్డి కళావేదిక నిర్మాణానికి రూ.ఏడు లక్షలతో పాటు లేమల్లెపాడు ఎంపీపీ పాఠశాల మరమ్మతుల నిమిత్తం రూ.లక్ష ఆర్థిక సహాయాన్ని అందజేయనున్నట్లు అశోక్‌రెడ్డి పేర్కొన్నారు.

మంత్రి రజినిపై బురద జల్లడం తగదు



నెహ్రూనగర్: వైఎస్సార్ సీపీ తరఫున గుంటూరు పశ్చిమ నియోజవర్గంలో సుడిగాలి పర్యటన చేస్తూ గెలుపు దిశగా అడుగులు వేస్తున్న వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజినిపై బురద జల్లే ప్రయత్నాలు మానుకోవాలని మాల ఐక్య సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు స్టాలిన్‌బాబు హితవు పలికారు. లక్ష్మీపురంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. అంబేడ్కర్ ఆశయాల సాధన కోసం కృషి చేస్తున్న రజినిపై ఆంధ్రా ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు కాల్వ రవి బురదజల్లే ప్రయత్నం చేయడాన్ని ఖండించారు. ఎవరెన్ని విమర్శలు చేసినా విడదల రజినిని తాము గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో గెలిపించుకుని తీరుతామని స్పష్టం చేశారు. సమావేశంలో చిలకా డేవిడ్, లక్ష్మయ్య, రమకాంత్, నరేష్ పాల్గొన్నారు.

గ్రామీణ పునర్నిర్మాణానికి జగ్జీవన్ విశేష కృషి

ఏఎన్‌యూ వీసీ పి. రాజశేఖర్



సమావేశంలో ప్రసంగిస్తున్న వీసీ రాజశేఖర్

ఏఎన్‌యూ : భారత దేశంలో గ్రామీణ ప్రాంతాల పునర్నిర్మాణానికి బాబూ జగ్జీవన్‌రామ్ విశేష కృషి చేశారని వీసీ ఆచార్య పి. రాజశేఖర్ పేర్కొన్నారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ బాబూ జగ్జీవన్ రామ్ అధ్యయన కేంద్రం ఆధ్వర్యంలో ' బాబూ జగ్జీవన్‌రామ్స్ కాంట్రిబ్యూషన్ ఆన్ ఇండియన్ రూరల్ రీ కన్‌స్ట్రక్షన్ అండ్ అగ్రికల్చర్' అనే అంశంపై రెండు రోజులపాటు నిర్వహిస్తున్న జాతీయ సదస్సు శుక్రవారం ప్రారంభమైంది. ముఖ్య అతిథిగా హాజరైన వీసీ ప్రసంగిస్తూ గ్రామీణ భారత పునర్నిర్మాణానికి, వికాసానికి జగ్జీవన్‌రామ్ ఎందరో మహనీయులు కృషి చేశారని , దాన్ని సమకాలీన అంశాలకు జోడించి ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు. దేశ గమనాన్ని నిర్ణయించే శక్తి గ్రామాలకు ఉందని, గ్రామీణ భారతాన్ని అర్థవంతమైన విధానంలో పునర్నిర్మించాల్సిన అవసరం ఉందని తెలిపారు. యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ ఆచార్యులు కె. రాజమోహనరావు కీలకోపన్యాసం చేస్తూ జగ్జీవన్‌రామ్ జీవితంలో ఎన్నో ఆటుపోట్లు ఎదుర్కొని అత్యున్నత స్థాయికి చేరారని, విద్యార్థులు ఆయన కృషి, మేధస్సును ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. జగ్జీవన్‌రామ్ అధ్యయన కేంద్రం కోఆర్డినేటర్ ఆచార్య కె మధుబాబు సదస్సు నిర్వహణ ఉద్దేశాన్ని వివరించారు. సదస్సులో దేశ వ్యాప్తంగా పలు యూనివర్సిటీల నుంచి 85 మంది పరిశోధనా పత్రాలు సమర్పిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో హైదరాబాద్ ప్రభుత్వ కళాశాల అధ్యాపకులు, కవి కోయి కోటేశ్వరరావు, మేఘాలయ నీహు అధ్యాపకులు డాక్టర్ శివాజీ దోనేటి, ఏఎన్‌యూ రిజిస్ట్రార్ ఆచార్య బి. కరుణ, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య సీహెచ్. స్వరూపరాణి, ఓఎస్‌డీ ఆచార్య కె. సునీత, నరసరావుపేట ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కాకాని సుధాకర్, పూలే అధ్యయన కేంద్రం కోఆర్డినేటర్ ఆచార్య త్రిమూర్తి రావు, డాక్టర్ సోమశేఖర్ ప్రసంగించారు. పలువురు అధికారులు, అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

డ్వాక్రా ఉత్పత్తులను ప్రోత్సహించాలి

నెహ్రూనగర్: డ్వాక్రా మహిళలు తయారు చేసిన ఉత్పత్తుల్ని ప్రోత్సహించి వారికి ఆర్థిక చేయూత అందించాలని రాష్ట్ర చేనేత ఉత్పత్తుల కమిటీ సభ్యురాలు, డ్వాక్రా బజార్ నిర్వాహకురాలు కోట దేవకీదేవి కోరారు. బృందావన్ గార్డెన్స్‌లో ఏర్పాటు చేసిన డ్వాక్రా బజార్‌లో శుక్రవారం స్టాల్స్‌ను ఆమె సందర్శించి మాట్లాడారు. డ్వాక్రా బజారు ఈ నెల 21వ తేదీ వరకు కొనసాగుతుందని తెలిపారు. స్టాల్స్‌లో డ్వాక్రా మహిళలు తయారు చేసిన నాణ్యమైన ఉత్పత్తులతో పాటు గద్వాల్, మదనపల్లి, వెంకటగిరి పట్టుచీరలు కూడా అందుబాటులో ఉంచినట్లు ఆమె చెప్పారు.

మహిళ మెడలో గొలుసు చోరీ

నగరంపాలెం: నడిచి వెళ్తున్న మహిళ మెడలో బంగారు గొలుసు తెంచుకెళ్లిన ఘటనపై పట్టాభిపురం పీఎస్‌లో కేసు నమోదైంది. విద్యానగర్ ఒకటో వీధిలో శుక్రవారం సాయంత్రం అత్తోట అరుంధతి నడిచి వెళుతున్నారు. ఈ క్రమంలో ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ఇద్దరు యువకుల ఓ పాఠశాల సమీపాన ఆమె మెడలోని బంగారు గొలుసు తెంచుకెళ్లారు. దీనిపై బాధితురాలు ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దళిత, బహుజనుల ఆశాజ్యోతి కాన్షీరాం



కాన్షీరాం విగ్రహానికి నివాళులర్పిస్తున్న మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు గోళ్ల అరుణ్‌కుమార్




కాన్షీరాం విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న బహుజన సమాజ్ పార్టీ నాయకులు

నెహ్రూనగర్: దళిత, బహుజనుల ఆశాజ్యోతి, సామాజిక సంస్కర్త కాన్షీరాం జీవితం నేటి యువతకు ఆదర్శనీయమని మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు గోళ్ల అరుణ్‌కుమార్ పేర్కొన్నారు. కాన్షీరాం జయంతిని పురస్కరించుకుని శుక్రవారం మాలమహానాడు ఆధ్వర్యంలో ఏసీ కాలేజీ ఎదురుగా ఉన్న ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా అరుణ్ కుమార్ మాట్లాడుతూ దేశంలో అణగారిన వర్గాల పక్షాన నిలబడి వారికి అండగా నిలిచిన ఏకైక వ్యక్తి కాన్షీరాం అని కొనియాడారు. చిన్న చిన్న కులాల వారిని సైతం పాలకులుగా మార్చిన ఆయనకే దక్కుతుందని తెలిపారు. కార్యక్రమంలో సంఘ నాయకులు యాదాల శాంతిరాజు, పాగళ్ల ప్రకాష్, బత్తుల వీరాస్వామి, చిన్నం డేవిడ్ విలియమ్స్, సుబ్బారావు, సురేష్ పాల్గొన్నారు.

బహుజన సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో..

అంబేడ్కర్ ఆలోచన విధానాలకు అనుగుణంగా బహుజనులకు రాజ్యాధికార సాధన కోసం కాన్షీరాం అహర్నిశలు కృషి చేశారని బహుజన సమాజ్ పార్టీ నగర అధ్యక్షుడు చింతా రాంప్రసాద్ పేర్కొన్నారు. కాన్షీరాం జయంతిని పురస్కరించుకుని ఏసీ కాలేజీ వద్ద ఉన్న ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాంప్రసాద్ మాట్లాడుతూ బహుజనులు తీవ్ర వివక్షకు గురవుతున్న రోజుల్లో బహుజనుల అభివృద్ధి, సంక్షేమం, బహుజనుల రాజ్యాధికార సాధన కోసం, ప్రజల పక్షాన నిలబడి కాన్షీరాం పోరాటం చేశారని కొనియాడారు. కార్యక్రమంలో సంఘ నాయకులు వర్ధన్‌యాదవ్, పచ్చిగొల్ల తేజ, సాధిక్, కటికల సాగర్ పాల్గొన్నారు.

మహిళాభ్యుదయంతోనే దేశ ప్రగతి



విజేతలకు బహుమతులు అందజేస్తున్న కళాశాల యాజమాన్యం

గుంటూరు రూరల్: మహిళా శక్తిని ప్రోత్సహిస్తే అద్భుతాలు సృష్టిస్తారని, అన్ని రంగాల్లో మహిళలకు సమాన ప్రాతినిధ్యం కలిగించినప్పుడే దేశ ఆర్థిక ప్రగతి వృద్ధి చెందుతుందని ప్రముఖ న్యాయవాది, ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్, డొమెస్టిక్ వాయిలెన్స్ సెల్ కౌన్సిలర్ కేవీ పద్మావతి పేర్కొన్నారు. చౌడవరం గ్రామంలోని ఆర్‌వీఆర్ జేసీ ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల ముగింపు కార్యక్రమంలో శుక్రవారం ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

ఆమె మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో మహిళలు అన్ని రంగాల్లో ముందుంటున్నారన్నారు. విద్యార్థినులకు మహిళా చట్టాలపై అవగాహన ఉండాలన్నారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు క్విజ్, నృత్యం, వక్తృత్వ పోటీలను నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్ శ్రీనివాస్, సెక్రటరీ కరస్పాండెంట్ ఆర్ గోపాలకృష్ణ, ట్రెజరర్ డాక్టర్ కృష్ణప్రసాద్, ప్రిన్సిపల్ డాక్టర్ శ్రీనివాస్, డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర, ఏవో డైరెక్టర్ డాక్టర్ ఎన్వీ శ్రీనివాసరావు, డాక్టర్ రాధారాణి, డాక్టర్ జి సుధావాణి తదితరులు పాల్గొన్నారు.

సనాతన ధర్మ విశిష్టతపై యువతకు అవగాహన అవసరం



సూర్యనారాయణమూర్తికి జ్ఞాపిక బహూకరిస్తున్న జూపూడి రంగరాజు, నాగభూషణం

గుంటూరు ఎడ్యుకేషన్: వేదాలు, ఉప నిషత్తుల్లో పేర్కొనబడిన సంస్కృతి, సంప్రదాయాల్ని పాటించాలని ఆంధ్రా వర్సిటీ విశ్రాంత న్యూ క్లియర్ కెమిస్ట్రీ ప్రొఫెసర్ డాక్టర్ గంటి సూర్యనారాయణమూర్తి పేర్కొన్నారు. అమరావతి రోడ్డులోని హిందూ ఫార్మసీ కళాశాలలో శుక్రవారం సనాతన ధర్మ విశిష్టతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న సూర్యనారాయణమూర్తి మాట్లాడుతూ ఫార్మసీ విద్యార్థులు చరక సంహిత, వేద గణిత శాస్త్రంతో పాటు భారతీయ వైద్య విధానంపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. రవీంద్రనాథ్ ఠాగూర్, స్వామి వివేకానంద జీవిత గాథల నుంచి స్ఫూర్తి పొందాలని తెలిపారు. విశ్రాంత మేజర్ జనరల్ బి. వెంకట్రావు మాట్లాడుతూ దేశంలోని జాతీయ భద్రతా విభాగాలు, వాటి బాధ్యతల గురించి విద్యార్థులకు వివరించారు. ఓటు హక్కు పొందిన ప్రతి విద్యార్థి దాన్ని వినియోగించుకుని, విశ్వసనీయ నాయకులను ఎన్నుకోవాలని సూచించారు. సమస్యల్ని శాంతియుతంగా పరిష్కరించుకోవాలన్నారు. విద్యార్థులు ఏ రంగంలో స్థిరపడినా జాతీయ భావంతో సమాజసేవ చేయాలని సూచించారు. ఆత్మనిర్భర భారత్, స్వచ్ఛభారత్ కార్యక్రమాలను గురించి తెలుసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ జూపూడి రంగరాజు, కరస్పాండెంట్ డాక్టర్ ఎస్. మధుసూదనరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.వి.నాగభూషణం, వైస్ ప్రిన్సిపాల్ కె. రవికుమార్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ పి. సీతారామయ్య, ఫార్మా డీ విభాగాధిపతి డాక్టర్ హేమకుమారి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఈవీఎంలు, వీవీ ప్యాట్ల వినియోగంపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న మాస్టర్ ట్రైనర్లు

నెహ్రూనగర్: సార్వత్రిక ఎన్నికల్లో ఈవీఎంలు, వీవీ ప్యాట్ల వినియోగంపై సెక్టోరల్ అధికారులు సమగ్ర అవగాహన కలిగి ఉండాలని అదనపు కమిషనర్, పశ్చిమ నియోజకవర్గ ఈఆర్‌ఓ కె. రాజ్యలక్ష్మి తెలిపారు. నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో శుక్రవారం మాస్టర్ ట్రైనర్ల ద్వారా సెక్టోరల్ అధికారులకు డెమో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజ్యలక్ష్మి మాట్లాడుతూ ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా గుంటూరు తూర్పు, పశ్చిమ నియోజకవర్గాల్లో సార్వత్రిక ఎన్నికల్లో వినియోగించే ఈవీఎంలు, వీవీ ప్యాట్లు పని చేసే విధానంపై సెక్టోరల్ అధికారులు సమగ్ర అవగాహన కలిగి ఉండాలని సూచించారు. పోలింగ్ కేంద్రంలో సమస్య ఎదురైతే వెంటనే పరిష్కారం చేసేలా ఈవీఎంల పనితీరు తెలుసుకోవాలని చెప్పారు. ఈవీఎం, వీవీ ప్యాట్ కనెక్షన్, సీల్ అత్యంత ప్రధానమైన అంశాలని తెలిపారు. ఈవీఎంలపై ఏ సందేహం ఎదురైనా పరిష్కారం చేయడానికి మాస్టర్ ట్రైనర్లు సిద్ధంగా ఉంటారని పేర్కొన్నారు.

పదవులు అలంకారం కాదు బాధ్యత



మహిళలను సత్కరిస్తున్న విప్ అప్పిరెడ్డి

విప్ లేళ్ల అప్పిరెడ్డి



విప్ అప్పిరెడ్డిని అభినందించి పుష్పగుచ్ఛం అందజేస్తున్న పీపీలు, న్యాయవాదులు

పట్నంబజారు: పదవులు అలంకారప్రాయం కాదని, బాధ్యతని శాసనమండలి విప్, వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి చెప్పారు. బృందావన్ గార్డెన్స్‌లోని విప్ క్యాంపు కార్యాలయంలో శుక్రవారం నూతనంగా పార్టీలోని పలు కమిటీల్లో నియమితులైన పలువురు ఆయన్ను మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. పదవులు లభించిన ప్రతి ఒక్కరిని విప్ అప్పిరెడ్డి దుశ్శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పానుగంటి చైతన్య, పార్టీ నేతలు గనిక ఝాన్సీ, విజయమాధవి, అరుణ, సత్యవతి, రత్నకుమారి, షకీల, రమణ, ఘంటా మరియమ్మ, జ్యోతి, లక్ష్మి, ప్రసన్న, శివపార్వతి, మాధవి, రెడ్డి కోటేశ్వరరావు, విద్యార్థి విభాగం నేతలు విఠల్, వినోద్, గంటి, రవి, బడే జగదీష్, అజయ్, సన్ని, కిరణ్, కరీంలాలా, మస్తాన్, కెనడీ పాల్గొన్నారు.

పీపీలు, న్యాయవాదుల అభినందనలు

గుంటూరు జిల్లా కోర్టులోని ఐదో అదనపు జిల్లా కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్, ఫ్యామిలీ కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నియమితులైన పల్లపు కృష్ణ, బొడ్డు కోటేశ్వరరావు శుక్రవారం శాసనమండలి విప్, వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. బృందావన్ గార్డెన్స్‌లోని ఆయన కార్యాలయంలో కలిసి దుశ్శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా విప్ అప్పిరెడ్డి మాట్లాడుతూ కష్టపడి పనిచేసిన ప్రతి ఒక్కరికీ సముచిత న్యాయం దక్కుతుందని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ లీగల్ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పోలూరి వెంకటరెడ్డి, జిల్లా అధ్యక్షుడు సి.డి.భగవాన్ పాల్గొన్నారు.

సీఏ పరీక్షలకు హాజరుకానున్న 4.36 లక్షల మంది విద్యార్థులు



మట్టుపల్లి మోహన్

గుంటూరు ఎడ్యుకేషన్: మేలో జరగనున్న సీఏ పరీక్షలకు దేశవ్యాప్తంగా 4.36 లక్షల మంది విద్యార్థులు హాజరుకానున్నట్లు మాస్టర్ మైండ్స్ అడ్మిన్ అడ్వైజర్ మట్టుపల్లి మోహన్ చెప్పారు. బ్రాడీపేటలోని సంస్థ కార్యాలయంలో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇనిస్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా (ఐసీఏఐ) 75 ఏళ్ల చరిత్రలో ఒక అపూర్వ ఘట్టం ఆవిష్కృతమైందని ఏసీఏఐ కేంద్ర పాలకమండలి సభ్యుడు రోహిత్ అగర్వాల్ ప్రకటించినట్లు వివరించారు. సీఏ ఫౌండేషన్, సీఏ ఇంటర్, సీఏ ఫైనల్ పరీక్షలకు పెద్ద సంఖ్యలో విద్యార్థులు హాజరు కానుండటం ఇదే మొదటిసారని పేర్కొన్నారు. దేశ వ్యాప్తంగా సీఏ చదివే విద్యార్థుల సంఖ్య పెరుగుతుండటం కోర్సులకు ఉన్న డిమాండ్‌ను తెలియజేస్తోందని తెలిపారు. టెన్త్ తరువాత ఇంటర్మీడియెట్‌లో ఎంఈసీ గ్రూప్ సీఏ చదవాలనుకునే వారికి అనువైన గ్రూప్ అని, ఇంటర్‌లో ఏ గ్రూప్ చదివినా చేరేందుకు అర్హులేనని వివరించారు. డిగ్రీ చదివిన విద్యార్థుల ఎవరైనా సరే డైరెక్టర్ ఎంట్రీ ద్వారా సీఏ కోర్సులో చేరవచ్చునని రోహిత్ అగర్వాల్ పేర్కొన్నట్లు చెప్పారు.

వినియోగదారుల హక్కులపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న కృష్ణమూర్తి

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రతి ఒక్కరికీ వినియోగదారుల హక్కులపై అవగాహన అవసరమని గుంటూరు వినిమయదారుల సంఘ కార్యదర్శి టి.వి.కృష్ణమూర్తి సూచించారు. ప్రపంచ వినియోగదారుల రక్షణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం పాత గుంటూరు ఎల్‌బీనగర్‌లోని నగరపాలకసంస్థ ప్రాథమికోన్నత పాఠశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణమూర్తి మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే చెడుకు వ్యతిరేకంగా ప్రశ్నించేతత్వాన్ని అలవర్చుకున్నప్పుడే భావి భారత పౌరులుగా ఎదగగలరని తెలిపారు. నాణ్యతలేని వస్తువుల విక్రయం, అసత్య ప్రచారాలు, మోసపూరిత ప్రకటనలు, నాణ్యత లేని వస్తువులపై ఆఫర్లకు దూరంగా ఉండాలని సూచించారు. కొన్న ప్రతి వస్తువుకు తగిన బిల్లులను తప్పనిసరిగా తీసుకోవాలని చెప్పారు. ఈ సందర్భంగా వినియోగదారుల రక్షణ కోసం జరిగిన ఉద్యమాలను వివరించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు డి. తిరుపతిరెడ్డి మాట్లాడుతూ వినియోగదారుల రక్షణ చట్టాన్ని అనుసరించి ఇంటి నుంచి సైతం వస్తువులు, బిల్లు, తదితర వివరాలతో ఆన్‌లైన్ ద్వారా కూడా ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. సంఘ ఉపాధ్యక్షుడు పి. రామాంజనేయులు మాట్లాడుతూ రక్షణ చట్టంలోని వెసులుబాటు, కోర్టు ఫీజు లేని ఏకైన రక్షణ చట్టంగా పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘ క్రియాశీలక సభ్యుడు జి. శ్రీహరి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.